పని గంటల పెంపును వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: కార్మికులకు పని గంటల పెంపుదల నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులకు 8 గంటల పని కోసం అనేకమంది ప్రాణాలు త్యాగం చేసి పోరాడి సాధించుకున్నారన్నారు. పని గంటల విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్ట సవరణ బిల్లులను అసెంబ్లీలో పెట్టి పెంచిన పని దినాల నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 10 గంటల పని విధానం రద్దు చేసి, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలన్నారు. ఫ్యాక్టరీలు, షాపులు, వివిధ సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు పని భారం పెంచే విధంగా ప్రభుత్వం చేస్తున్న కుట్ర ప్రయత్నాన్ని విరమించు కోవాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా ప్రభుత్వాలు పనిభారం పెంచడానికి మాత్రం అసెంబ్లీలో తీర్మానం చేయడం విచారమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెరిగిన ధరలను అనుగుణంగా కార్మికుల జీతాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేపడతామని ఆయన హెచ్చరించారు.

ఊట గెడ్డలో నీటిని పట్టుకుంటున్న గిరిజనులు

అస్తవ్యస్తంగా ఉన్న రహదారి మార్గం

గూడెం గిరిజనుల గోడు వినేదెన్నడో?

- రోడ్డు, తాగునీరు, విద్యుత్ సమస్యలతో సతమతం
- అమలు కాని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

గ్రామంలోని పూరి గుడిసెలు

ప్రజాశక్తి -అనంతగిరి: కనీస మౌళిక వసతులకు నోచుకోక పోవడంతో గూడెం గ్రామం గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
మండలానికి మారుమూల నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ పరిధి కొండ శిఖరు గూడెం గ్రామంలో 17 కుటుంబాలకు పైగా 80 మంది జనాభా తాత మూత్తాతల కాలం నుండి జీవనం కొనసాగిస్తున్నారు. నేటి వరకు ఆ గ్రామానికి కనీసం మౌళిక వసతులు కల్పించిన దాఖలాలు లేదు. రోడ్డు, కరెంటు, తాగునీటి . వంటి తదితర సమస్యలతో గ్రామానికి చెందిన గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
కూటమి ప్రభుత్వం అడవి తల్లికి బాట. డోలి రహిత ఆంధ్ర ప్రదేశ్. కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ అనంతగిరి మండలం పెద్దకోట పంచాయతీ. డుంబ్రిగూడ మండలాలలో పర్యటించి రోడ్డు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టి నెలలు గడుస్తున్నా మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలకు కనీస రోడ్డు మౌలిక వసతుల కల్పన అందని ద్రాక్షగా మిగిలింది. కూటమి ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయలు నిధులు వెచ్చిస్తున్నట్లు ప్రకటనలకే పరిమితమైందే తప్ప ఆచరణలో అమలు కాలేదు

రోడ్డు లేక ఇబ్బందులు...

కనీసం రోడ్డు మార్గ సదుపాయం లేక పోవడంతో ఇటు పంచాయతీ కేంద్రానికి 20 కిలోమీటర్లు, వైద్యం కోసం ఆసుపత్రికి 50 కిలోమీటర్లు దూరం భీమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎత్తయిన కొండ కోనల నడుమ డోలీలతో రోగులకు తరలించవలసి వస్తుంది. అంతేకాకుండా ఇటు విజయనగరం జిల్లా పరిధి ఆసుపత్రులకు వెళ్లాలన్నా 30 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఆ గ్రామానికి ఏడాది క్రితం ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా ఫార్మేషన్ రోడ్డు తాత్కాలికంగా నిర్మించారు వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. బైక్, అంబులెన్స్ వంటి వాహనాలు తిరగలేని పరిస్థితి ఏర్పడింది .

తాగునీటి సమస్యతో సతమతం.

కనీస తాగునీటికి గత్యంతరం లేక గ్రామానికి చెందిన 17 కుటుంబాల గిరిజనులు కిలోమీటర్ల దూరం కొండ ప్రాంతంలో ఉన్న ఊట నీటిని సేకరించి ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది దీంతో, పలు రోగులతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరా అందించవలసిన అవసరం ఎంతైనా ఉంది. మండల ఆర్‌బ్ల్యూఎస్ అధికారులు తాగునీటి సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. నేటి వరకు పరిష్కారం కాలేదు.

అంధకారంలో గ్రామం

గ్రామంలో పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్లాంటేషన్ 8 ఏళ్ల క్రితమే మరమ్మతుకు చేరుకుంది. దీంతో ఆ గ్రామమంతా అంధకారంలో మగ్గుతుంది. విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కరెంటు మంజూరు చేయలేదు. దీంతో, గిరిజనులు రాత్రుల సమయంలో బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది .

మంజూరు కాలనీ గృహాలు

నిరుపేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న గృహాలు 17 కుటుంబాలకు ఒక ఇల్లు కూడా నేటి వరకు మంజూరు కాలేదు. దీంతో, ఆ గ్రామానికి చెందిన గిరిజనులు తాటి కమ్మ పాకలలో నివాసం కొనసాగిస్తున్నారు.

కొండకుమ్మర్ల సమస్యలను పరిష్కరించాలి

- జిసిసి చైర్మన్ కిడారికి వినతి

ప్రజాశక్తి-పాడేరు: కొండకుమ్మర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులోని కిడారి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ కు ఆదివారం కొండ కుమ్మర్ల సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా జీవిస్తున్న కొండ కుమ్మర్లను ఎస్టీ నాయక్ లుగా ప్రభుత్వం గుర్తించాలని గిరిజన ప్రాంతంలో కొండకుమ్మర్లగా ఉండటంతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ స్పందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లి కొండకుమ్మర్ల సమస్యలను తీసుకువెళ్తానని కిడారి చెప్పారన్నారు.

దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న గిరిజనులు

హైడ్రో పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయొద్దు

-నవయుగ కంపెనీ, ప్రభుత్వ దిష్టి బొమ్మల దహనం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని బూర్జ పంచాయతీ మజ్జివలస గ్రామంలో ఆదివారం హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రభావిత గ్రామ ప్రజలు నిరసన తెలిపారు. ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని గిరిజనులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం, నవయుగ కంపెనీల దిష్టి బొమ్మలను దహనం చేశారు. హైడ్రో పవర్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ కో-కన్వీనర్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాపుల కృష్ణారావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఏకపక్షంగా జారీ చేసిన జీఓ-51ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసులను జల సమాధి చేసి కార్పొరేట్ కంపెనీలకు బలి ఇచ్చే చీకటి ఒప్పందాలను రద్దుచేయాలని పేర్కొన్నారు. గత 15న నిర్వహించిన శాంతియుత మహాధర్నాలో పాల్గొన్న నాయకులపై పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు శాంతియుత నిరసనలను అశాంతి పేరుతో చూపించి, నిరసనకారులపై కేసులు పెట్టడం వారి వైఖరికి నిదర్శనం అని మండిపడ్డారు. ప్రభుత్వం, పోలీసులు, ఆదివాసుల సహనాన్ని పరీక్షిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కృష్ణరాజు, సురేష్, జామున, పార్వతి, ప్రభావిత గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కొండలపై కనువిందు చేసిన పాల మేఘాలు

చింతపల్లిలోని కొండలపై సుందరంగా ఉన్న పాల మేఘాలు

ప్రజాశక్తి-చింతపల్లి : అల్లూరి ఏజెన్సీ చింతపల్లి పరిసర కొండలపై ఆదివారం పాల సముద్రాన్ని తలపించేలా మేఘాలు కనువిందు చేశాయి. ఆదివారం మధ్యాహ్నం తేలికపాటి జల్లులు కురిశాయి. ఈ సమయంలో కొండలపై తెల్లటి మబ్బులతో కప్పబడుతూ పాల సముద్రాన్ని తలపించేలా కనపడింది. మధ్యాహ్నం కురిసిన వర్షపు జల్లులతో పచ్చని చెట్లూ, పొదలు మెరిసిపోగా, తడిసిన రహదారిపై సూర్యకాంతి ప్రతిబింబిస్తూ వాహనదారులను ఆకట్టుకుంది. రహదారుల వెంట వెళ్లే వాహనదారులు ఆగి, ప్రకృతి అందాలను కెమెరాలో బంధిస్తూ, సెల్ఫీలు తీసుకోవడమే కాకుండా ఆ అందాలను ఆస్వాదించారు. ఉదయం సూర్యోదయం, సాయంత్రం సూర్యాస్తమయం సమయాల్లో ఈ కొండల సోయగాలు మరింత అద్భుతంగా కనిపిస్తున్నాయి. చింతపల్లి-కొయ్యూరు, చింతపల్లి-నర్సీపట్నం మార్గాల్లో ప్రయాణించే వారు ఈ దృశ్యాలను చూసి మంత్రముగ్ధులవుతున్నారు.

కలిసి పోరాడితేనే హక్కుల సాధన

- ఆశ వర్కర్స్ యూనియన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్

కూనవరంలో మాట్లాడుతున్న పల్లపు వెంకట్

ఎటపాక: మాట్లాడుతున్న మట్ల వాణిశ్రీ

ప్రజాశక్తి-ఎటపాక: కలిసి పోరాడితేనే హక్కులు సాధించుకోగల మని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మట్ల వాణిశ్రీ అన్నారు. ఆదివారం ఎటపాకలో సిఐటియు అనుబంధ ఆశ వర్కర్స్ యూనియన్ మండల మహాసభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలుగా పనిచేసే ఆశాలపై పని భారం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. 12 రకాల యాప్‌లను వాడటం, రికార్డులను తయారు చేయడం వంటి పని భారంతో పాటు, రోగులకు ఏదైనా జరిగితే దానికి పూర్తి బాధ్యత ఆశ కార్యకర్తలే అని వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. ఐక్యంగా ఉండి సంఘం తరపున పోరాడితే మన సమస్యలను పరిష్కరించుకోగలమని అన్నారు. విశాఖలో జరిగే సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 25 మందితో ఆశా వర్కర్స్ యూనియన్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా కె.పద్మ, కె.జయ, కోశాధికారిగా ఉషారాణి, ఉపాధ్యక్షురాలుగా కళ్యాణి, సీత, కె.వరలక్ష్మి, సహాయ కార్యదర్శిగా ప్రేమవాహిని, శశిరేఖ, సావిత్రిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు లాలీబాయి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ పద్మ, సిఐటియు జిల్లా నాయకులు ఐ వి, మండల నాయకులు పులుసు బాలకృష్ణ పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని శ్రీమార్త శ్రీరామ్మూర్తి భవన్‌లో పాయం సీతారామయ్య అధ్యక్షతన ఆశా యూనియన్ మండల మహాసభ నిర్వహించారు. ఆశా కార్మికులు ముందుగా సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు సమస్యల పరిష్కారానికి భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆ పోరాటాలకు దిక్సూచి గా నిలిచే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం 15 మందితో నూతన కమిటీ, ఏడుగురితో ఆఫీస్ బేరర్స్‌ను మహాసభ ఎన్నుకుంది. కూనవరం మండల కార్యదర్శిగా కారం సుజాత, అధ్యక్షులుగా ఎర్రంశెట్టి రేణుక, కోశాధికారిగా తుష్టి ఝాన్సీ, ఉపాధ్యక్షులుగా మడెం భద్రమ్మ, బీరబోయిన శారద, సహాయ కార్యదర్శులుగా పాయం రాధ, గంపల వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల ఆశా కార్మికులు, సిఐటియూ నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జడ్డంగి అన్నవరం వరకూ పక్కా రహదారి వేయాలి

ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు డిమాండ్

రోడ్డును పరిశీలిస్తున్న లోతా రామారావు తదితరులు

ప్రజాశక్తి- అడ్డతీగల: ఏలేశ్వరం నుంచి జడ్డంగి అన్నవరం వరకూ వయా అడ్డతీగల రహదారిని తాత్కాలిక మరమ్మతులు చేయడం కాకుండా పక్కా రహదారి నిర్మించాలని ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు డిమాండ్ చేశారు. ఆదివారం రహదారి పరిశీలించిన ఆయన రహదారిపై గుంతలను పూడ్చారని, ఇది కొంతవరకూ మంచిదేనని అయితే శాశ్వత పరిష్కారం చూపాలని గతంలో నిర్వహించిన మహాధర్నాలో ఈ మేరకు అధికారులు హామీ ఇచ్చారని పక్కారహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28వ తేదీ లోపు పనులు ప్రారంభించని పక్షంలో అక్టోబర్ 10వ తేదీ నుంచి వేలమందితో మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గేరా వెంకటరమణ, గునుపూడి ప్రసాద్, వై. నాని, గెడ్డం వీరబాబు, బి. దుర్గ బాబు, కసిరెడ్డి రాజు, వెంకన్నబాబు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగం బయట పెట్టాలి

- అంబేద్కర్ యువజన సంఘం డిమాండ్

మాట్లాడుతున్న కిషోర్

ప్రజాశక్తి-కూనవరం: కూనవరం పంచాయతీలో జరిగిన అవినీతిపై ప్రభుత్వ అధికారులు స్పందించి దుర్వినియోగానికి సంబంధించిన ఆధారాలను బయటపెట్టి దుర్వినియోగం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం డిమాండ్ చేసింది. టేకులబోరులో ఆదివారం అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి కిషోర్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. రవీంద్ర మాట్లాడుతూ పంచాయతీ నిధుల విషయంలో ఎటువంటి అవినీతి జరగలేదని చెప్పడం కాదు నిరూపించుకో వాలన్నారు. గతంలో సర్పంచ్ మృతి చెందితే ఉపసర్పంచ్‌ను సర్పంచ్‌గా 6 నెలలు నియమిం చారని, పంచాయతీ ఎన్నికలు నిర్వహించగా కట్టం రాజమ్మ సర్పంచ్‌గా ఎన్నిక య్యారని, మరి ఇప్పుడు సర్పంచ్ కట్నం రాజమ్మ మృతి చెందితే ఉపసర్పంచ్‌కి సర్పంచ్ పదవి ఇచ్చి ఆరు నెలల్లోపు ఎన్నికలు ఎందుకు పెట్టలేదని నిలదీశారు. మీరు నిజాయితీపరులైతే నిరూపించుకోండి తప్ప మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడితే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. నిధుల దుర్వినియోగంపై సంబంధిత అధికారులకి ఫిర్యాదు చేస్తామని అధికారులు చర్యలు తీసుకోక పోతే గ్రామీణ అభివద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు చిమడ బోయిన వెంకటేశ్వర్లు (వెంకన్న), అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు కొవ్వాల రాజా, సంఘం గ్రామ అధ్యక్షులు కొత్తపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని దోసర్పాం గ్రామంలో తోట చెల్లారత్నం (55) శనివారం రాత్రి పాము కాటుకు గురై మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం చెల్లారత్నం ఇంటిదగ్గర పని చేస్తుండగా గోడలో ఉన్న పాము ఆమెను ఆకస్మికంగా కాటు వేసింది. దీంతో తీవ్ర అస్వస్థత గురైన ఆమెను సర్పంచ్ చీడి శివ ఆధ్వర్యంలో గ్రామస్తులు తొలుత రాజవొమ్మంగి పిహెచ్‌సికి తరలించారు. పిహెచ్‌సి వైద్యాధికారి సతీష్ ప్రథమ చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. 108 లో తరలిస్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ మస్తాన్‌వల్లి

ముమ్మరంగా వాహన తనిఖీలు

తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-సీలేరు: మావోయిస్టు ఆవిర్భావ దినోత్సవాలు సందర్భంగా ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దుల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈనెల 21 నుంచి 27 వరకు ఆవిర్భావ దినోత్సవాలు జరుపుకోవడానికి నిమగ్నమైనట్లు తెలుస్తోంది. సిపిఐ మావోయిస్టు కేంద్ర కమిటీ ఆవిర్భావ దినోత్సవాలు విజయవంతం చేయాలని ఇప్పటికే లేఖను విడుదల చేసింది. దీంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో అదనపు పోలీసు బలగాలతో జల్లెడు పడుతున్నారు. మావోయిస్టులు ఎటువంటి దుశ్చర్యలకైనా పాల్పడతారని ఇంటెలిజెన్స్ వర్గాలు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాయి. ఈ మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఎస్ఐ రవీంద్ర తనిఖీలు నిర్వహిస్తున్నారు.

జ్వరాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-సీలేరు: జికెవీధి మండలం సీలేరు పిహెచ్‌సి పరిధిలో వైరల్ జ్వరాలు తీవ్రత అధికంగా ఉందని అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఖాదర్ మస్తాన్‌వల్లి వెల్లడించారు. ఆయన 'ప్రజాశక్తి'తో ఆదివారం మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో వైరల్ జ్వరాలు ఎక్కువగా నమోదవు తున్నాయని పేర్కొన్నారు. వీధుల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. సీలేరు పరిసర గ్రామాల్లో కుక్క కాటు కేసులు ఎక్కువగా నమోదవుతు న్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరా రు. పాము, కుక్క కాటు వ్యాక్సిన్లు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. సీలేరు పిహెచ్‌సి పరిధిలో ప్రతిరోజు 70 నుంచి 80 మంది రోగులు ఓపికి వస్తున్నారని ఒకే వైద్యాధికారి ఉండడంతో వైద్యసేవలు అందించడం ఇబ్బందిగా ఉందన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి 'కృపాభారతి' కృషి

మాట్లాడుతున్న ట్రస్ట్ చైర్మన్ కృపారావు

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని బిసికాలనీలో కృపాభారతి చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేయుటం జరిగిందని చెర్మన్ కె.కపారావు మీడియాకు తెలిపారు. ట్రస్టు ముఖ్య ఉద్దేశం అన్ని ప్రాంతాల ప్రజల అభివృద్ధికి సహాయక చర్యలు చేపడుతుందని, పేదపిల్లలకు వృద్ధులకు, వికలాంగులకు, అనాథల సంక్షేమ అభివృద్ధికి తోడ్పాటుగా ఉంటుందని, చిన్న చిన్న కుటీర పరిశ్రమలు, బోర్లు, మెడికల్ క్యాంపుల నిర్వహణ, తాటిపీచు పరిశ్రమలు నెలకొల్పడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. చెర్మన్ కృపారావు, సెక్రటరీ భారతి, ట్రెజరర్ కె.శామ్యూల్, సభ్యులు జి.రాజారావు, బి.రవికుమార్, ట్రూత్ ఇవాంజిలికల్ చర్చి సభ్యుల ఆధ్వర్యంలో ట్రస్టు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- రంపచోడవరం : రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి వారి అధ్వర్యంలో సిరిగిందలపాడులో రామకృష్ణ మిషన్ వద్ద ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. క్యాంప్ ఇంచార్జి స్వామి లోకమయనంద మహారాజ్ పాల్గొని వైద్యసేవలను పర్యవేక్షించారు. సుమారు 600 మందికి వైద్యపరీక్షలు చేసినట్టు స్వామీజీ తెలిపారు.

వర్షాలతో రోడ్డు కోత

పూతికపుట్టు సమీపంలో కోతకు గురైన రోడ్డు

ప్రజాశక్తి- అనంతగిరి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రహదారులు కోతకు గురవుతున్నాయి. మండలానికి మారుమూల కివర్ల. పెద్దకోట, .పినకోట పంచాయతీల పరిధి చిడిమెటు, బోనూరు, టెంకలబంద మీదుగా పూతికపుట్టు సుమారు 10 గ్రాములకు పైగా రింగ్ రోడ్డు పనులు చేపట్టేందుకు గత మూడేళ్ల క్రితం రోడ్డు పనులను ప్రారంభించారు. నత్త నడకన పనులు చేపడుతుండటంతో అక్కడక్కడ రోడ్డు పై వేసిన మెటల్, కంకర రాళ్లు బురదమయంగా మారాయి. రోడ్డు పనులు నిలిచి పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి . అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు రాలేని పరిస్థితి నెలకొంది. బైక్, .ఆటోలు, అంబులెన్స్‌లు తిరగలేని పరిస్థితితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మన్యంలో కుండపోత వర్షం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో ఆదివారం కుండ పోత వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసి ఆ తర్వాత సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా భారీ కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షంతో మండల కేంద్రంలోని వీధి కాలువలు, రోడ్లన్నీ జలమయంగా మారాయి. పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో తిలకించడానికి వచ్చిన పర్యాటకులు నిరాశతో వెనుదిరిగారు.

చెట్టు కూలి రాకపోకలకు అంతరాయం

కూలిన చెట్టును తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. మండలంలోని చెరుకుంపాలెంతో పాటు పలుచోట్ల చెట్లు విరిగిపడడంతో 11 కెవి విద్యుత్‌స్తంభం, ఎల్టి స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖాధికారి దొరబాబు ఆధ్వర్యంలో సిబ్బంది యుద్ధప్రాతిపదికన చెట్లను విద్యుత్ పునరుద్ధించారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. జడ్డంగి మడేరువాగు కింద్ర పెద్దేరువాగు, గింజర్తి, రాజవొమ్మంగి గ్రామ శివారు ఒట్టిగడ్డ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆదివారం కురిసిన భారీ వర్షానికి రాజవొమ్మంగి గ్రామశివారు ఒట్టిగెడ్డ వాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి..

అప్పన్న సన్నిధిలో హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి- వేపగుంట : సింహాద్రి అప్పన్నను ఆదివారం ఎపి హైకోర్టు జడ్జి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు ఆలయ ఇఒ వేంద్ర త్రినాథరావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత న్యాయమూర్తిని వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఇఒ స్వామిశేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. ఎఇఒ కె. తిరుమలేశ్వరరావు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

సెల్ సిగ్నల్స్ అందక అవస్థలు

ప్రజాశక్తి - దేవీపట్నం: మండలంలోని దేవారం గ్రామంలో సుమారు ఐదు వందల మంది జియో, బిఎస్ఎన్ఎల్ కస్టమర్స్ సిగ్నల్స్ సక్రమంగా అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లం శేఖర్ అన్నారు. ఇటీవల స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ సమయంలో లబ్ధిదారునిసెల్ నెంబర్‌కి వచ్చిన ఒటిపి చెప్పాల్సి వచ్చిన సందర్భంలో సిగ్నల్స్ లేక ఇబ్బంది పడ్డారు. రైస్‌కార్డులు పంపిణీ చేయడానికి వచ్చిన సచివాలయ సిబ్బంది సిగ్నల్స్ లేకపోవడం సర్వర్ పనిచేయకపోవడంతో వాయిదా వేశారు. మొత్తానికి ఎలాగో ఇబ్బందులు పడి రైస్‌కార్డులు పంపిణీ చేశారు. ఇటీవల ఉపాధి వేతనదారులకు వారి పోస్టల్ అకౌంట్‌లో డబ్బులు తీసుకోవాలని పోస్టాఫీస్‌కు వెళ్తే సిగ్నల్స్ సక్రమంగా లేకపోవడంతో పేమెంట్లు అవకం ఇబ్బంది పడ్డారు. దేవారం గ్రామానికి కిలోమీటరున్నర దూరంలో జియో టవర్, అర కిలోమీటరు దూరంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఉన్నాసరే సిగ్నల్స్ రావటం లేదన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమావేశానికి హాజరైన ములకాల సాయికష్ణ తదితరులు

పార్టీ విస్తరణపై దృష్టి పెట్టాలి

- జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికష్ణ

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: పార్టీ విస్తరణపై దృష్టి పెట్టాలని, రాబోయే పంచాయతీ ఎన్నికల్లో పార్టీ కార్యాచరణపై రాష్ట్ర స్థాయి సమావేశాల్లో దిశానిర్దేశం చేసినట్టు జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికష్ణ ప్రకటనలో తెలిపారు. ఆదివారం మంగళగిరిలో ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం మాట్లాడు తూ కార్యకర్తలంతా పార్టీ విస్తరణలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు, పార్టీ బలోపేతం దిశగా చర్యలు, ఇలా ప్రతీ సమస్యపై చర్చ జరిగినట్టు తెలిపారు. సమావేశంలో నున్నా బాలసుబ్రహ్మణ్యం,కూనవరం అధ్యక్షులు దాసరి నరేంద్ర కుమార్, ఎటపాక అధ్యక్షులు మారాసు గంగాధర్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ బొజ్జయ్య తదితరులు

సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక యర్రంరెడ్డినగర్‌లో సర్పంచ్ మంగా బొజ్జయ్య అధ్వర్యంలో ఆదివారం సిసి రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. కార్యక్రమంలో రంపచోడవరం మండల వైస్ ఎంపిపి కొమిశెట్టి బాలకృష్ణ, ఉపాధ్యక్షులు కన్నబాబు, వార్డు సభ్యులు సుధాకర్, వెంకటరావు, మాజీ డిసిసిబి సొసైటీ చైర్మన్ రామన్నదొర, మాజీ డిసిసిబి సభ్యుడు చాకల నాగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి కామరాజు పాల్గొన్నారు.

కాఫీ తోటల అభివృద్ధికి కృషి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ : కర్ణాటకలోని టాటా కాఫీ ఎస్టేట్ సందర్శన

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లాలోని కాఫీ తోటలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి పరచడానికి కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ వెల్లడించారు. జిల్లాలోని కాఫీ తోటలను ఎటువంటి పురుగు పట్టకుండా పెంచడానికి, దానికి సంబంధించిన యంత్రాలను ఉపయోగించే విధానం, తద్వారా మార్కెటింగ్ చేయడం వంటి పద్ధతిని అభివృద్ధి పరచడానికి కర్ణాటక రాష్ట్రం కూర్గ్ జిల్లాలోని మడికేరి పట్టణం కుషాల్ నగర్ ప్రాంతంలో ఉన్న టాటా కాఫీ ఎస్టేట్ ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. కాఫీ తోటలో క్యూరింగ్ పనులు, ల్యాబ్, పల్పింగ్ యూనిట్లను పరిశీలించారు. కాఫీ తోటల్లో పని చేస్తున్న రైతులను కలిసి వారి ద్వారా వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకులో పండించే కాఫీకి దేశ వ్యాప్తంగా మంచి పేరు సాధించిందని, దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అరకు కాఫీని పరిచయం చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. అనంతరం కర్ణాటక రాష్ట్ర కూర్గ్ జిల్లా కలెక్టర్ ను కలిసి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. టాటా కాఫీ బోర్డు సభ్యులు, టాటా కాఫీ సీనియర్ మేనేజర్లు వినయ్, అయ్యప్ప, కాఫీ బోర్డు డిడి. చంద్రశేఖర్, సీనియర్ లైజనింగ్ అధికారి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కాఫీ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నేడు, రేపు ఎయులో యువజనోత్సవాలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ :ఆంధ్ర విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా వర్సిటీ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీలలో 11 అంశాలలో యువజన ఉత్సవాన్ని నిర్వహించడానికి ఎయు అధికారులు నిర్ణయించారు. ఈనెల 22న సోమవారం వక్తృత్వ, వ్యాసరచన, వాదప్రతివాద, క్విజ్, రంగవల్లులు, చిత్రలేఖనం, నాటికల విభాగాలలో పోటీలను నిర్వహిస్తారు. 23న మంగళవారం సోలో, గ్రూప్ సాంగ్ పోటీలు,, శాస్త్రీయ నృత్యం మరియు జానపద బృందనాట్యాల పోటీలు నిర్వహిస్తారు. ఎయు అనుబంధ కళాశాలల ఎన్‌సిసి కార్యకర్తలందరూ పోటీల్లో పాల్గొనవచ్చని, విజేతలకు ఈనెల 24న బుధవారం యువజనోత్సవం రోజున బహుమతులను అందజేస్తారు. ఈసందర్భంగా జాతీయ సమైక్యతా ర్యాలీని నిర్వహిస్తారని ఎన్‌సిసి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి. సింహాచలం తెలిపారు.

బుద్ధ గయను బౌద్ధులకు అప్పగించాలి

నిరసన వ్యక్తం చేస్తున్న బౌద్ధులు

ప్రజాశక్తి కరాస: బుద్ధునికి జన్మస్థలం బౌద్ధగయను బౌద్ధేతరుల కబంధహస్తాల నుంచి రక్షించి బౌద్ధులకు అప్పగించాలని జిల్లా మహాబోధి సొసైటీ, బర్మా ఆంధ్ర బౌద్ధ సంఘం అధ్యక్ష ,కార్యదర్శులు గుణపూడి బాబులు, బోర వేణుగోపాల్ గౌతం డిమాండ్ చేశారు. ఆదివారం మర్రిపాలెం రైతు బజార్ దరి గౌతమబుద్ధ ధ్యానం వనం బుద్ధ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని శాంతియుత నిరసన దీక్ష చేపట్టారు. ముందుగా బుద్ధ వందనం ప్రార్థన నిర్వహించారు.బీహార్ ప్రభుత్వం 1949 బుద్ధ గయ యాక్ట్ చట్టాన్ని రద్దు చేయాలిని, బిటిఎంసి కమిటీలో పూర్తిగా బౌద్ధలనే నియమించాలని.డిమాండ్ చేశారు.కార్యక్రమంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్, వివి దుర్గారావు, గొంది నవీన్, కొత్త పిల్లి వెంకటరమణ, జి. రవికుమార్, యార్లల వెంకటరావు, సిరికి సింహాద్రి, బొడ్డు రాము, ఎమ్. హరి వినాయక్, ధనాల ఈశ్వర రావు, బోర సిద్ధార్థ గౌతమ్, పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచల వరాహలక్ష్మీనరసింహ స్వామి నిత్యాన్నప్రసాదానికి పాత గాజువాక, పంతులుగారి మేడ సింహాద్రి ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన బి. శ్రీనివాసరావు రూ. లక్ష విరాళంగా అందించారు. ఆలయసన్నిధిలోని విరాళాల కౌంటర్‌లో నగదు చెల్లించి రశీదు పొందారు. ఈ సందర్భంగా దాతకు ప్రొటోకాల్ సీనియర్ సహాయకులు సూర్యనారాయణ స్వామి నిత్య అన్నప్రసాదం బాండ్ అందజేశారు. అనంతరం కుటుంబ సమేతంగా స్వామి అంతరాలయ దర్శనం కల్పించి, స్వామి శేష వస్త్రంతో సత్కరించారు. ఆలయ పర్యవేక్షణ అధికారి బలువు సత్య శ్రీనివాస్ ప్రసాదాలను దాతకు అందజేశారు.

ఘనంగా శాంతి దినోత్సవం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలిజియస్ ఫ్రీడమ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ ఎల్‌బి కాలేజీ ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో అంతర్జాతీయ శాంతి దినోత్సవం నిర్వహించారు. తొలుత సర్వ మత ప్రార్థనలు చేశారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంస్థ చైర్మన్.నరవ ప్రకాశ రావు అధ్యక్షతన సమావేశంలో విశ్రాంత ప్రొఫెసర్ వి బాలమోహన్‌దాస్, ఆచార్య కె.రవి మాట్లాడుతూ ఉగ్రవాదంతో ఆయుధ సంపత్తిని పెంచుకుంటున్న ప్రపంచ దేశాల మధ్య నమ్మకం నానాటికీ సన్నగిల్లుతోందన్నారు. శాంతిని నెలకొల్పడంతో ఐక్యరాజ్యసమితితో భారత్ పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని పోలీసులకు అప్పగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హుస్సేన్, .ప్రజ్ఞాన కుమార్, డాక్టర్ కెవిఎస్ మూర్తి, చాట్ల బాబూరావు రెడ్డి, బౌద్ధభిక్షువులు కంటే భిక్షు, రాజధామ్ భిక్షు .బంగార్రాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-సీలేరు:
సీజన్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హోమియో వైద్యాధికారి డాక్టర్ సజనరాయి పేర్కొన్నారు. ఆదివారం సీలేరు పోలీస్‌స్టేషన్ సిఆర్‌పిఎఫ్ క్యాంపులో ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షుగర్, బిపి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆహార నియమాలు గురించి వివరించారు. మొబైల్ ఎక్కువగా వినియోగిం చడం వలన మెదడు, కంటిపై ఒత్తిడి ఎక్కువగా పెరిగి అనారోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. ధ్యానం చేయడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలుచేకూరుతుందని తెలిపారు. హెచ్‌ఎస్‌త్రినాథ మాట్లాడుతూ దోమతెరలు వినియోగించాలని సూచించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సిఆర్‌పిఎఫ్ కమాండెంట్ పివిగౌడ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సజనారాయి

ఎల్.ఏంజెల్స్ స్కాలర్‌షిప్ పంపిణీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన ప్రతిభ గల 30 మంది పేద విద్యార్థులకు జపాన్‌కు చెందిన ఎల్ ఏంజెల్స్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ అసోసియేషన్ రూ.3.60 లక్షలు విలువైన స్కాలర్‌షిప్‌ను అందజేశారు. రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమానికి ఎల్ ఏంజెల్స్ ఇంటర్నేషనల్ వాలంటీర్స్ అసోసియేషన్‌కు చెందిన 22 మంది ప్రతినిధులు హాజరై స్కాలర్‌షిప్, బహుమతులు అందజేశారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు యోషి నగౌర మాట్లాడుతూ, స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులు తమ ఉజ్వలమైన భవిష్యత్తుకు బాటలు వేసుకుని భారతదేశ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. తమ అసోసియేషన్ ద్వారా ఏటా సహాయాన్ని కొనసాగిస్తామన్నారు. విశాఖలో స్కాలర్‌షిప అందజేసేందుకు వీలుగా ఎల్ ఏంజెల్స్ సమన్వయకర్త మండ జానకిరామ్ అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ పూర్వ అధ్యక్షులు, ఎల్ ఏంజెల్స్ సమన్వయకర్త మండ జానకిరామ్ మాట్లాడుతూ, ప్రతిభ గల పేద విద్యార్థులకు సహాయం అందించాలనే సదుద్దేశంతో ప్రతి ఏటా స్కాలర్‌షిప్ అందజేస్తున్న ఎల్ ఏంజెల్స్ అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. రోటరీ పూర్వ గవర్నర్ ఎంసి.దాస్ మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ అధ్యక్షులు పిల్లలమర్రి రఘు, కార్యదర్శి బిఎస్ఎన్ బెనర్జీ, కోశాధికారి వి.పాండురంగరాజు, హనుమంతరావు, పూర్వాధ్యక్షులు బి.బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సును విజయవంతం చేయండి

జాయింట్ సెక్రటరీ సరితా చౌహాన్, రాష్ట్ర ఐటి సెక్రటరీ కాటమనేని భాస్కర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అధికారులంతా సమన్వయంతో పనిచేసి 28వ జాతీయ ఈ-గవరన్నెన్స్ సదస్సును విజయవంతం చేయాలని జాయింట్ సెక్రటరీ సరితా చౌహాన్, రాష్ట్ర ఐటి సెక్రటరీ కాటమనేని భాస్కర్ కోరారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్, ఇతర అధికారులతో కలిసి విశాఖ కలెక్టరేట్‌లో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమ, మంగళవారాలలో నోవాటెల్ హోటల్‌లో జరగనున్న సదస్సు నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై కేంద్ర, రాష్ట్ర, జిల్లా అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకో వాలని, కార్యక్రమ నిర్వహణలో ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభంగా ఉండేందుకు అధిక సంఖ్యలో కౌంటర్లు పెట్టాలని, ప్రత్యేక వెబ్ లింక్ ఓపెన్ చేసి ఆన్‌లైన్‌లో కూడా రిజిస్టర్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్‌లో ఉండే వారు అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరేం అడిగినా సమాచారం ఇచ్చేలా సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. సదస్సులో రాజకీయ, అధికార ప్రముఖులు భాగస్వామ్యం అవుతున్నారని తెలిపారు.

విజయవంతంగా ముగిసిన రీజనల్ సంవాద్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖపట్నం జిల్లా కమిటీ భాగస్వామ్యంతో నిర్వహించిన రీజనల్ సంవాద్ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్ మాట్లాడుతూ సంవాద్ అనేది దేశవ్యాప్తంగా ఆదివాసులను ఒక వేదికపైకి తీసుకురావడానికి ట్రైబల్ ఐడెంటిటీని టాటా స్టీల్ ఫౌండేషన్ ద్వారా అంకితటోప్పో, జెమ్స్‌వింజ్, క్రాంతి కిరణ్‌దొర, వెంకటరాజా హాజరయ్యారని తెలిపారు. ఈ సంవత్సరం మొదటి సారి అల్లూరి సీతారామరాజు జిల్లా, విశాఖపట్నం జిల్లా ఆదివాసుల సంప్రదాయాలు, సంస్కృతి, అభివృద్ధి, ఆలోచనలను పంచుకోవడానికి ప్రాంతీయ సంవాద్ కార్యక్రమం ఎంవిపిలోని గిరిజన్ భవన్‌లో నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బాక సత్యారావు, నాయకులు ముత్యంగి ప్రసాదరావు, సీసా శోభన్, ప్రసాదరావు, జి.దాలిబాబు, కొక్కుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న యువతులతో నిర్వాహకులు

నేరాలు ఘోరాలు

100 కిలోల గంజాయి స్వాధీనం

నిందితులతో పోలీసులు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని కొంతిలి జంక్షన్ వద్ద శనివారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీల్లో 100 కేజీల గంజాయి పట్టుకున్నారు. సిఐ సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో ముందస్తు సమాచారం మేరకు నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో ఒరిస్సా నుంచి బెంగళూరుకు తరలిస్తున్న కారు ఆపి తనిఖీ చేసి గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిఐ సన్యాసి నాయుడు మాట్లాడుతూ, గంజాయి పండించడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పట్టుబడిన వారి ఆస్తులను కూడా ప్రభుత్వానికి సరెండర్ చేయనున్నట్లు తెలిపారు. యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ప్రభుత్వ, ప్రైవేటు రంగ ఉద్యోగావకాశాలను సాధించాలని ఆయన సూచించారు. ఈ ఆపరేషన్‌లో ఎస్సై సూర్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల నూతన ప్రెస్ క్లబ్ ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. మండల కేంద్రంలో జరిగిన ఈ ఎన్నికల్లో నూతన ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులుగా పిడిమి విజయవెంకట్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా బి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కూడ మోహన్, కార్యదర్శిగా రెయ్యల నాగభూషణం, కోశాధికారిగా గంపరాయి కోటిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా బి.ప్రసాదరావు, కాంతారు మోహన్, వి.ఉదయ్ కుమార్, సర్ని సురేష్, ఎస్.శంకర్ రావు, పి.బాస్కర్ రావు. కె.అనిల్, కె.రాంబాబు, పి.పులిరాజు, కె. ఈశ్వర్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు శ్రీనివాసరావు, నాగభూషణం లు మాట్లాడుతూ, ప్రెస్ క్లబ్ బలోపేతంతో పాటు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

గంగవరంలో...

ఎన్నికైన నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - గంగవరం: మండలపరిషత్ కార్యాలయంలో ఆదివారం ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక జరిగింది. జయకృష్ణ పట్నాయక్ అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా ఉదయ్‌శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎం.నాగేశ్వరరావు, ఉప కార్యదర్శిగా వైఆర్‌కె ప్రసాద్, కోశాధికారిగా నందూరి రమేష్, గౌరవ అధ్యక్షులుగా ఎస్.వై.బాషా, వాడపల్లి శేషాచార్యులుభాష డి.వెంకటరత్నంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులు జయకృష్ణ అధ్యక్షతన నూతన కార్యవర్గ సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో జర్నలిస్ట్ సమస్యలు సంక్షేమం గురించి ప్రస్తావించారు.

పింఛన్ మంజూరు చేయరూ..!

కొర్రగోరా

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరుకు చెందిన కొర్ర గోర (70) పింఛన్ మంజూరు చేయాలని మొరపెట్టుకుంది. ఆమె భర్త ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటివరకు తన భర్త గాసికి వద్ధాప్య పింఛన్ వచ్చేది. ఆయన మృతి చెందిన తరువాత వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటివరకూ పింఛన్ మంజూరు కాలేదని వాపోయారు. ఏడాదిన్నర నుంచి సచివాలయం చుట్టూ తిరుగుతున్నా పింఛన్ రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తోంది. అధికారులు స్పందించి పింఛన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతోంది.

సామ్‌సంగ్ గెలాక్సీ ఎ 065జి పై రాయితీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సామ్‌సంగ్ పండుగ సీజన్‌కు ముందు గెలాక్సీ ఎ06 5జి స్మార్ట్‌ఫోన్‌పై మునుపెన్నడూ చూడని ధరను ప్రకటించినట్లు సంస్థ ప్రతినిధి విహాన్ చెప్పారు. నగరంలోని హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, పరిమిత-కాల ఆఫర్‌లో భాగంగా గెలాక్సీ ఎ 06 5జి కేవలం రూ.9899కే అందుబాటులో ఉంటుందన్నారు. గెలాక్సీ ఏ06 5జి కొనుగోలు చేసే వినియోగదారులు రూ.1399 విలువైన సామ్‌సంగ్ 25 డబ్ల్యూ ట్రావెల్ అడాప్టర్ కేవలం రూ.299కే పొందుతారని వివరించారు.

ఫ్యాషన్ డిజైన్స్ ప్రదర్శనలో యువతులు

ఆకట్టుకున్న ఫ్యాషన్ డిజైన్స్ ప్రదర్శన

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్స్ ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నం పోర్టు కళావాణి ఆడిటోరియంలో నిర్వహించిన ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో ప్రధానంగా ఫ్యాషన్స్, ఇంటీరియర్, ఫొటోగ్రఫీకి సంబంధించిన పలు రకాల శైలిని ఔత్సాహికులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్ ప్రతినిధి స్వాతి బండారు మాట్లాడుతూ, తమ సంస్థ తరపున మూడవ ఎడిషన్‌గా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసామన్నారు. ఫ్యాషన్, ఇంటీరియర్, ఫొటోగ్రఫీ రంగాలలో రాణించాలనుకునే వారికి ఈ ప్రదర్శన చక్కని మార్గదర్శిగా ఉంటుందని చెప్పారు.